# అల్పబుద్ధి

వీరపత్ని వీణావాణి

సాయంత్రం ఆరు గంటలవుతోంది.

అది శీతాకాలం కనుక ఆరు గంటలకే బాగా చీకటి పడిపోయింది. వచ్చీ పోయే బస్సులతోనూ ప్రయాణీకులతోనూ బస్‌స్టాండ్ చాలా రద్దీగా వుంది. జనాభా విషయంలో భారతదేశం ఎంత గొప్ప ప్రగతిని సాధించిందో ఈ బస్‌స్టాండ్‌ను చూస్తే చాలు-బాగా అర్థమైపోతుంది. అరగంట నుండి నేను బస్‌స్టాండ్‌లో నిలబడివున్నాను.

నేను ఎక్కవలసిన బస్ యింకా రాలేదు. దాని కోసమే నేను వెయిట్ చేస్తున్నాను. వెయిట్ చెయ్యడమంటే నాకు మహా విసుగు. ఈ దేశంలో ప్రతి మనిషి జీవితం ప్రతిదాని కోసం వెయిట్ చెయ్యడంలోనే సగం గడిచి పోతుందని నా అభిప్రాయం. చాలా సేపటి నుండి నిలబడడం వల్ల నా కాళ్ళు పీకుతు న్నాయి. రాని బస్ మీద కోపం వస్తోంది.

"సార్!" ఎవరో పిలవడంతో తల తిప్పి ఎడంవేపు చూశాను.

అతడికి యాభై సంవత్సరాలుంటాయి. పోతపోసిన యినుప విగ్రహంలా బాగా బలిష్టంగా ఉన్నాడు. ముఖం కొంచెం పీక్కు పోయివుంది. ఒంటి మీద తెల్లటి బట్టలున్నాయి. సార్ అంటూ అతడు యిందాకా పిలిచింది నన్నేనని అతడి చూపుల వల్ల నిర్ధారణ చేసుకున్నాను. ఇంత వరకు నేను ఎప్పుడూ ఎక్కడా అతడిని చూసి ఎరగను.

"సార్!" మళ్ళీ పిలిచాడతడు.

ప్రశ్నార్థకంగా అతని వేపు చూశాను.

"సార్! మాది ఈ ఊరు కాదు. ఇక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో వున్న ఒక పల్లెటూరు మాది. ఈ రోజు ఉదయం ఓ పని మీద ఈ ఊరు వచ్చాను. టౌన్ బస్‌లో ఎవడో ఉదయం నా జేబులోని డబ్బులు కొట్టేశాడు. తిరిగి మా వూరు వెళ్దామన్నా చార్జికి డబ్బులు లేవు. మీబోటి వాళ్ళను కొందరిని అడిగితే... కొంత డబ్బిచ్చారు. కానీ యింకా అర్ధ రూపాయి తక్కువగా వుంది."

వెంటనే నాకు విషయం అర్థమైపోయింది.

రైల్వేస్టేషన్స్‌లోనూ, బస్ స్టాండ్స్‌లోనూ, హోటల్స్ ముందూ ఎన్నోసార్లు నేను యిలాంటి వాళ్లను చాలా మందిని చూశాను. చార్జికి డబ్బులు తక్కువయ్యాయంటూ ప్రతి వాడూ యిలాగే అరిగిపోయిన రికార్డ్‌లా పచ్చి అబద్ధాలు చెబుతుంటాడు. ఇది ఒక రకంగా క్లాసికల్ బెగ్గింగ్. పరిశుభ్రమైన బట్టలు ధరించ డం ఈ క్లాసికల్ బెగ్గింగ్‌లో ఒక భాగం.

"సార్!" అంటూ అతడేదో చెప్ప బోయాడు.

"నువ్వింకేమీ చెప్పనవసరం లేదు. నా కంతా తెలుసు. నీలాంటి వేషగాళ్ళను నేను రోజూ చూస్తూనే వున్నాను. నీ గాలి కబుర్లను నమ్మేంత తెలివి తక్కువ వాడిని కాదు. మనిషి చూస్తే దున్నపోతులా వున్నావు. ఏ దైనా పని చేసుకోక యిలా అబద్ధాలు చెబుతూ అడుక్కో వడానికి నీకు సిగ్గు లేద టయ్యా?" అంటూ నాలుగు దులిపేశాను.

నామాటలు అతని గుండెల్లో బరిసెపోట్లు పొడిచినట్టు న్నాయి. రోషం పొడుచుకుని వచ్చి నట్లుంది. చటుక్కున తలెత్తి నా కళ్ళలోకి ఓ సారి చూసి అక్కడి నుండి వెళ్ళి పోయాడతడు. అతడు చూసిన ఆ చూపు చూపులా లేదు. చురకత్తిలా వుంది. అభిమానం ఏకోశానా లేని వాడు రోషం తెచ్చుకోవడంలో అర్థం లేదని కొంతమందికి తెలియదు.

పది నిముషాలు గడిచాయి.

ఇంతలో నేను ఎదురు చూసిన బస్ రానే వచ్చింది. అదిస్టాండ్‌లో ఆగగానే.. మాంసం ముక్క కోసం కాట్లాడుకుంటూ ఎగబడే కుక్కల్లా జనం ఆ బస్ దగ్గర చేరి లోపలికి జొరబడసాగారు. అదేదో సంకుల సమరంలా వుందే తప్ప ప్రయాణీకులు బస్‌లోకి ఎగబడు తున్నట్లుగా లేదు. అమితమైన ఈ పోటీ ప్రపం చంలో అదీ ఒక భాగమే.

నానాతంటాలు పడి బస్‌లోకి ప్రవేశించి ఒక సీట్‌ను సంపాదించే సరికి నాతల ప్రాణం తోకకి వచ్చింది. అదృష్టవశాత్తు నాకు విండో దగ్గర సీట్ దొరికింది. పద్మవ్యూహంలో అభి మన్యుడిలా... అడ్డున్న ప్రయాణీకులను ఛేదించు కుంటూ టికెట్స్ యివ్వసాగాడు కం డక్టర్.

"మీరెక్కడికి సార్?" అడిగాడు నన్ను కండక్టర్.

"కామవరం క్రాస్‌రోడ్"చెప్పాను.

"మూడు రూపాయలివ్వండి" అన్నాడు కం డక్టర్. నేను యాభై రూపాయల నోటు యిచ్చాను.

"అందరూ నోట్లేయిస్తే నేను చిల్లర ఎక్కడ నుండి తేవాలి?" అంటూ కండక్టర్ విసుగు ప్రకటించాడు.

పావు గంటలో బస్సు టౌన్ దాటి వచ్చే సింది. కిటికీ వద్దకూర్చోవడం వల్ల గాలి చల్లగా తగుల్తోంది. గత రెండు రాత్రులు నాకు సరిగ్గా నిద్రలేకపోవడం చేత... చల్లగాలి తగలగానే నా కళ్ళు మూతలు పడిపోయాయి. ప్రయాణంలో నిద్రపోతూ... పక్కన కూర్చున్న వాడి మీద పదే పదే పడడమనేది చాలా అసహ్యకరమైన విషయం.

అయినా... ఎంత ప్రయత్నించినా నిద్ర ఆపుకోలేక పోయాను."కామవరం క్రాస్‌రోడ్‌లో దిగవలసిన వాళ్ళు ఇంకా ఎవరండీ?'' అని కండక్టర్ గట్టిగా అరవడంతో ఉలిక్కిపడి పైకి లేచాను. నన్ను చూసి బస్ లోని వాళ్ళంతా విసుక్కోసాగారు. మారు మాట్లాడకుండా గబ గబా బస్‌లోంచి దిగేసాను. టైం సుమారు ఎనిమిది కానస్తోంది.

ఈ కామవరం క్రాస్ రోడ్‌లో మరో బస్సెక్కి నేను ఇంకా పదిహేను కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి. గతంలో ఈ ప్రాంతానికి నేను ఒక్కసారే వచ్చాను. ఇన్నాళ్ళకు మళ్ళీ ఒక ఫ్రెండ్ పెళ్ళికి ఇటు రావలసి వచ్చింది.

బస్ వచ్చేలోగా సిగరెట్ పాకెట్ కొనుక్కుందామని డబ్బుల కోసం జేబులో చెయి పెట్టాను. అంతే... నాగుండె ఝల్లుమంది.

నా జేబులో కేవలం బస్ టికెట్ మాత్రమే వుంది. ఆ టికెట్ వెనుక నలభైఏడు రూపాయల చిల్లర మళ్ళీ యిస్తానని నోట్ చేశాడు కండక్టర్.

కానీ... చిల్లర తీసుకోవడం మరిచిపోయి నేను హడావుడిగా బస్ దిగేశాను. ఇప్పుడేం చెయ్యాలి? ఎవరిని అడగాలి? నా దగ్గర యిక ఒక్క పైసా కూడా లేదు. దిక్కుతోచక అలాగే శిలలా అరగంట నిలబడిపోయాను.

''ఏవూరు వెళ్లాలండి?'' ఎవరో యిద్దరు మనుషులు అటువేపు వెళుతూ నన్ను చూసి అడిగారు.

''రుద్రవరం వెళ్లాలి''చెప్పాను నేను.



"మీరిక్కడుండగానే... రుద్రవరం వెళ్లే బస్సులు రెండు వెళ్లిపోయాయి. మీరు చూడ లేదా?"

"చూశానండీ! కానీ..." అంటూ నా దగ్గర డబ్బుల్లేవని, కండక్టర్ దగ్గర చిల్లర తీసుకోవడం మరిచిపోయానని నా పరిస్థితి గూర్చి వాళ్ళకు వివరంగా చెప్పాను. చార్జికి ఒక్క రూపాయి యిచ్చి సహాయం చెయ్యమన్నాను.

నా మాటలు విని వాళ్ళు నావేపు అదో రకంగా చూశారు. ఆ చూపులోని అపనమ్మకం నాకర్థమైంది. దయనీయమైన నా పరిస్థితికి నాకళ్లలో నీళ్లు తిరిగాయి. కాళ్లలో సత్తువ సన్నగిల్లింది. రోడ్డు పక్కన చింతచెట్టు కింద చీకట్లో వున్న రాతి బండపై కూర్చుందామని అటు వేపు నడిచాను. అదే బండపై మరో మనిషి కూర్చుని బీడీ కాలుస్తున్నాడు.

నేను వెళ్లి అతని పక్కనే కూర్చున్నాను. అతనితో నేను మెల్లగా మాటలు కలిపి... నా పరిస్థితి గురించి చెప్పి... చార్జికి డబ్బులు అడిగాను.

"మీరు గాభరా పడకండి. మిమ్మల్ని బస్




ఎక్కిస్తాను. బస్ వచ్చే టైమైంది. రండి రోడ్ మీదికి వెళ్దాం" అంటూ పైకి లేచి నడవసాగాడతడు. అతడి వెంట నేనూ నడిచాను. ఇద్దరం రోడ్ మీదికి వచ్చి వెలుతుర్లో నిలబడ్డాం.

"ఈ డబ్బు తీసుకోండి" అంటూ అయిదు రూపాయల నోటును అందిస్తుంటే అప్పుడు చూశాను అతని ముఖంలోకి. అంతే... నేను స్థాణువైపోయాను. నాకాళ్ల కింది భూమి బద్దలైపోతున్నట్టు... అందులో నేను యిరుక్కుపోయి పాతాళానికి జారిపోతున్నట్టనిపించింది. రెండున్నర గంటల క్రితం... టౌన్ బస్ స్టాండ్‌లో నిలబడి... చార్జికోసం నన్ను యాచించిన మనిషి.

"మీరొచ్చిన బస్‌లోనే నేనూ టౌన్ నుండి వచ్చాను. ఇదే నండి మా ఊరు. బస్ వస్తున్నట్టుంది. డబ్బు తీసుకోండి!"

జీవితంలో మొదటి సారిగా సిగ్గుతో చచ్చిపోయాను. ఎవరిని మనం అవమానిస్తామో... వాళ్ల చేత క్షమింపబడడం కంటే సిగ్గు పడవలసిన విషయం మరోటి లేదు. ఎవరిని మనం అపనమ్మకంతో చూస్తామో... వాళ్ల చేత విశ్వసింపబడే క్షణం కంటే... సిగ్గు పడవలసిన క్షణం మరోటి లేదు. నేను గబుక్కున అతడితో "నా అల్పబుద్ధిని మన్నించండి" అనేశాను. నవ్వుతూ అతడు నాచేతుల్లోంచి తన చేతుల్ని వెనక్కు లాక్కున్నాడు. ●

